వారం వారం

# ఆ-కా-శ-వా-ణి
# సంగీత సమీక్ష

'పరుసవేది'

సోమవారం నవ్వంబరు 20

## ఎమ్. ఎస్. బాలసుబ్రహ్మణ్య శర్మ గారి గానం

బరువైన రవ్వజాతి సంగతులలో ఖచ్చితమైన శైలిలో గానం చేశారు శర్మగారు. జగన్మోహిని రాగము, అరాణా రాగకీర్తన బాగా పాడారు. రవ్వజాతి సంగతులు కొద్దిగా తగ్గించి, నయమైన గమక సంగతుల కెక్కువ ప్రాధాన్యం ఇస్తూ చల్లదనమూ, రక్తిపై శ్రద్ధ వహించి గానం చేస్తే వీరి పాట ఇంకా శోభిస్తుంది.

మంగళవారం, నవంబరు 21

## బి. రామారావుగారి ఫిడేలు వాద్యం

కడిగిన ముత్యాలా అనేలాగ కీర్తనలు స్వరమూ చక్కగా నిర్వహించారు. సాఫైన వాద్యం చేతికి అమిరిన విద్వాంసులు పాండిత్య ప్రకర్ష మనోధర్మ శక్తి ప్రదర్శించాలి అని కోరుతూ ఉంటారు శ్రోతలు.

## "మువ్వగోపాల" అనే సంగీత రూపకం

భావ, మాటలు, పాటలు, నటన ఒకదాన్ని మించి ఒకటి రంజింపచేస్తూ అద్భుతంగా నడిచింది రూపకం. ఇల్లాంటి సంగీత రూపకాలు శ్రోతలకు చాలా ఆనందం గొలుపుతాయి. ఎన్ని రూపకాలు విన్నా విసుగు పుట్టదు. శ్యామా శాస్త్రి చరిత్రకూడా సంగీత రూపకంద్వారా రేడియోవారు వినిపించాలని కోరడంలో ఆశ్చర్యమేమీ లేదు.

గురువారం నవంబరు 3

## బి. హెచ్. రాధాదేవిగారి పాట

మనిషి బొమ్మలు రాయాలంటే రకరకాల ముక్కులు చెవులు, కళ్లూ, వేళ్లు వేరేవేరే రాయడం కృషిచేస్తాడు చిత్రకారుడు. అల్లా చేస్తేనే బొమ్మలకు నిజస్వరూపము వస్తుంది. అదేవిధంగా పాట పాడేవారు సామాన్యంగా అమలులో ఉన్న రాగాల తాలూకు సంగతులు బాగా నేర్చి వందలసార్లు కృషిచేస్తే రాగం పాడుతున్నప్పుడు ఎప్పుడు పాడదగిన సంగతి అప్పుడు సునాయాసంగా పలుకుతుంది. ఆవిధంగా సంగతులు పలికినప్పుడే రాగం స్వరూపాన్ని కలిగిఉంటుంది. రాధాదేవిగారు పట్టమ్మాళ్, వసంతకుమారి పాడిన గ్రామఫోను పాటల నేర్చి అలాగేపాడడం అలవాటు చేస్తే అభివృద్ధిలోకి రాగలరు.

శుక్రవారం నవంబరు 24

## కంభంపాటి చినఅచ్చయ్యగారినాగస్వర వాద్యం

వీరు వాయించిన కీర్తనలు చక్కని బాణీలో ఉన్నాయి. శైలి గమకశుద్ధంగా ఉంది. రాగభావము విడవకుండా రాగం వాయించడముపై శ్రద్ధ నిలిపి కృషిచేసి రేశంలో మంచిపేరుసంపాదించాలి వీరు. సామరాగంలో గాంధారములో నిలిపితే బాకుండదు. "సరిగమ" "దనిస" అనే ప్రయోగాలు ఈ రాగంలో రానివ్వకూడదు.

శనివారం నవంబరు 25

## అబ్దుల్ అజీజ్ గారి హిందుస్థానీ సంగీతం

చిన్న పిల్లలు దడుసుకునేలాగ గాత్రాన్ని జోరుగా విసురుతూ హిందూస్థానీ పాటకులవికారాలు గాని ప్రదర్శిస్తున్నారా అనేలాగ పాడేరు

అజీజ్ గారు. కర్ణాటక గానంకంటె ఉత్తర దేశపు గానం సుఖంగా ఉంటుంది అనే అభిప్రాయానికి చాలా విరుద్ధంగా ఉంది వీరి పాట. వస్తాదుగిరీ పాడేవిషయంలో కనబడాలి గాని పటాటోపంలో కాదు.

సోమవారం నవంబరు 27

## సింగరాజు సూర్యనారాయణరాజు గారి గానం

చల్లగా, సాఫైన బాణీలో పాడేరు రాజు గారు. కష్టపడి పెద్ద విద్వాంసుడుగా తయారు కావాలనే ఆశ పట్టుదలలతో కృషి చెయ్యాలి వీరు.

మంగళవారం నవంబరు 28

## సరిదే సుబ్బారావుగారి ఫిడేలు వాద్యం

వీరి వాద్యంలో పొడి స్వరాలతో అల్లిన రవ్వ సంగతులు జాస్తిగా వినబడ్డాయి. గమకంకూడా జోడించినప్పుడు ఫిడేలు వాద్యం రక్తికడుతుంది. సుస్వరం చేతికి బాగా అమిరిన సుబ్బారావు గారికి గమక శైలి కష్టమైన పనికాదు.

బుధవారం, నవంబరు 29

## కర్లపాలెం చంద్రమౌళిగారి గానం

ఉచితమైన గమక జ్ఞానంతో గానం చేశారు చంద్రమౌళిగారు. కాని గాత్రానికి బరువుచాలక సంగతులు తేలిపోతున్నాయి. ప్రథమకాలకీర్తనలు సాంతంగా తంబురా మీటుతూ సాధకం చేస్తే ప్రతీసంగతినీ, ప్రతీ అక్షరాన్నీ పోషిస్తూ పాడగలుగుతారు చంద్రమౌళిగారు. కాంభోజి కీర్తన బాగుంటుంది.

## ధారా శ్రీదేవిగారి వీణావాద్యం

వాయించినంతమట్టుకు పొల్లులేకుండా చల్లగా నడిచింది వాద్యం. కేదార కీర్తనలో సంకీర్ణమిశ్ర ఖండగతులలో ముక్తాయి నడపడం ప్రశంశనీయం. ఈమె వాద్యంలో స్ఫురిత గమకం కనబడలేదు. రవ్వసంగతులు తరచూ వినబడడం వీణావాద్యానికి అత్యవసరం. అవి బాగా అలవాటుచెయ్యాలి వీరు.

శుక్రవారం డిసెంబరు 1

## వోలేటి వేంకటేశ్వర్లుగారి గానం

నేడు ప్రత్యేకంగా రేడియో జంత్ర సమ్మేళనంసహా పాడారు. జంత్రసమ్మేళనం తోడుగా వచ్చిన నిండు శ్రోతలకేమీ తోచలేదు. గాయకుని కీర్తనల బాణీని జంత్రనిర్వాహకులు గమనించి, కృషిచేసి తోడుగా వాయిస్తే పాట చాలా నిండుగా ఉంటుంది.

శనివారం డిసెంబరు 2

## కారైకుడి సాంబశివయ్యరు గారి వీణావాద్యం

శంకరాభరణ, తోడిరాగములు గంభీరముగా సావకాశముగా అభివృద్ధిచేస్తూ బాగా వాయించారు. వీరి వాద్యములో గమనించదగిన విషయాలు—స్ఫుటత్వమూ, శృతిశుద్ధత నాదపుష్టి గొప్ప వ్యక్తులు అని చెప్పబడే వీణ విద్వాంసులు తెనుగుదేశంలో అవతరించాలి అంటే రాక్షస సాధకం చెయ్యాలి ఇప్పటి వైణికు లందరూను. ఆటుపైని భగవదేచ్ఛ.

ఆదివారం డిసెంబరు

## ఎ, ఖాన్ మీరుతిగారిక్లార్‌నెట్ వాద్యం

బొంబాయినుండి ఉదయం ౮ గంటలకు క్లారినెట్ వాద్యం వినవచ్చింది. స్వరముల మధ్య గమకాలకంటే స్వర స్థానములకు ప్రాధాన్యమిచ్చే ఉత్తరదేశపు సంగీతం వాయించడానికి ఈ జంత్రం బాగానే ఉంటుంది. అయితే ఈ జంత్రంపై గమకముకంటె పైకాలపు సంచారాలెక్కువగా ప్రదర్శిస్తారు ఆదేశపు విద్వాంసులు. ఖాన్ మీరుతి గారు పైకాలంలో అసాధారణమైన సంచారాలు హృదయరంజకంగా చేశారు. ఇల్లాంటి వాద్యాలు ఆంధ్రదేశపు క్లారినెట్ విద్వాంసులు శ్రద్ధగా విని అమోఘస్తరుగా శ్రోతలకు వినిపించాలని ఆశిస్తున్నాము. ఈ మోస్తరు వాద్యాలను గ్రామఫోను రికార్డులద్వారా వినిపించవలసిన బాధ్యత రేడియోవారికికూడా ఉంది.

1950 దశకంలో ఆనందవాణి అనే పత్రికలో " ఆకాశవాణి - సంగీత సమీక్ష " శీర్షికతో ప్రచురించబడ్డ వ్యాస పరంపరలోని కొన్ని వ్యాసాలు ఇక్కడ చూడవచ్చు.

ఇలాటివి, మరియు ఆకాశవాణికి సంబంధించిన ఏ చిన్న భాగం అయినా, అది ఆడియో అవ్వొచ్చు, ఫోటో అవ్వొచ్చు, వ్యాసం అవ్వొచ్చు, మరేదైనా అవ్వొచ్చు, అవి మీ వద్ద వుంటే పంచుకోగలరని ఆశిస్తూ....

కాపీరైటు హక్కుల ఉల్లంఘన ఉద్దేశం లేదనీ, లాభాపేక్ష / ధనార్జన ఉద్దేశమంతకన్నా లేదనీ సవినయంగా తెలియచేసుకుంటూ - ఈ వ్యాసాలు ఇక్కడ, ఇలా రేడియో అభిమానులకు అందుబాటులో ఉంచటానికి అభ్యంతరాలు ఎవరికైనా ఉంటే తప్పక తెలియపర్చండి. క్షమాపణలతో వెంటనే తొలగిస్తాను.

భవదీయుడు

మాగంటి వంశీ మోహన్

http://www.maganti.org/